


www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 11 | ఆగస్టు | 2025 పేజీలు : 8

# శ్రీశైలం నుంచి నీటి తరలింపును ఆపండి

-పోలవరం ఎత్తు తగ్గించాలి
-బనకచర్లను అంగీకరించం
-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
-సహచర మంత్రులతో కలిసి జవహర్ ఎత్తిపోతలకు శంకుస్థాపన






**ప్రజాపక్షం/ ఖమ్మం :** శ్రీశైలం ఎగువ భాగాన పోతిరెడ్డిపాడు హెడ్‌రేగ్యులేటర్ నుంచి నీటి తరలింపును తక్షణం నిలిపివేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని కోరారు. 11 టిఎంసిల నీటిని తరలిస్తే 25 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందని తద్వారా నల్గొండ, ఖమ్మం జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర మండలంలో వైరానదిపై రూ. 600 కోట్లతో నిర్మిస్తున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి సహచర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీహరి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా సాగర్ ఆయకట్టు రెండవ జోన్‌లోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో 30వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా రోజు ఒక టిఎంసి నీటిని విడుదల చేస్తేనే లక్షలాది ఎకరాలు సాగవుతుందని మిగతా 2లో..

## హెచ్‌ఎంఎస్‌తో కవిత దోస్తీ

### -బిఆర్‌ఎస్‌కు రాంరాం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెఎస్) మాజీ గౌరవాధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత హెచ్‌ఎంఎస్‌తో దోస్తీ చేయనున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పాటైన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి ఆమె సుదీర్ఘకాలం గౌరవాధ్యక్షురాలిగా పని చేశారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణిపై కవిత పరోక్ష పెత్తనం చేస్తుందని అప్పట్లో తీవ్ర ఆరోపణలు వచ్చాయి. టిబిజికెఎస్‌కు రాంరాం చెప్పి తన జాగృతి సంస్థ ఇక నుంచి హెచ్‌ఎంఎస్‌తో కలిసి పని చేస్తుందని వెల్లడించారు. సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ పేరుతో హెచ్‌ఎంఎస్‌కు అనుబంధంగా యూనియన్ పని చేస్తుంది. ఇప్పుడు హెచ్‌ఎంఎస్‌తో కలిసి కవిత నేతృత్వంలోని జాగృతి సంస్థ పని చేస్తుందని కవిత వెల్లడించారు. హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో ఆమె చర్చలు జరిపారు. ఇటీవల కాలంలో కవిత నిర్ణయాలు బిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా మిగతా 2లో..

## మనిషికో రీతి.. బయ్యారం పోలీసుల రీతి..!

-అక్రమ ఇసుక రవాణాపై అదుపేది..?
-పట్టుకుని వదిలేస్తున్న పోలీసులు



**ప్రజాపక్షం/పినపాక :** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. జిల్లాలో రెవెన్యూ, పోలీస్ అధికారులు సైతం అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకు విరుద్ధంగా బయ్యారం పోలీసులు మనిషికో రీతిగా వ్యవహరిస్తున్నారు. పేదలు, ఇతరులైతే కఠిన చర్యలు తీసుకుంటుండగా అధికార పార్టీకి చెందిన వారు పెద్దలైతే ఎటువంటి ఆంక్షలు, జరిమానాలు లేకుండా యథేచ్ఛగా వదిలేస్తున్నారు. స్థానికంగా అక్రమ ఇసుకను నియంత్రించాల్సిన పోలీసుల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆదివారం సాయంత్రం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు మిగతా 2లో..






# శ్రీశైలం నుంచి నీటి తరలింపును ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

అటువంటిది పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 11 టిఎంసిలు తరలించుకుపోతే ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒకవైపు కేంద్రంతో మరో వైపు న్యాయ స్థానాల్లో తెలంగాణ వాటాల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని ఆయన తెలిపారు. వీరిద్దరూ గట్టిగా నిలబడడంతో బనకచర్ల, శ్రీశైలం లిఫ్టు నిర్మాణం ఆగిందన్నారు. భద్రాచలం డివిజన్‌లోని గిరిజనులు నివసించే ఏడు మండలాలను పక్కన పెట్టాలని సోనియాగాంధీకి విజ్ఞప్తి చేస్తే ఆమె సానుకూలంగా స్పందించారని కానీ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి తెలంగాణలోని బిఆర్‌ఎస్ లు కలిసి ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించాయని భట్టివిక్రమార్క తెలిపారు. గిరిజనులకు సంబంధించిన రెండు లక్షల ఎకరాలు ఆర్డినెన్స్ ద్వారా పోలవరానికి దారాదత్తం చేశారని ఆయన ఆరోపించారు. గిరిజనులపై ఏ మాత్రం ప్రేమ ఉన్న ఏపి సిఎం పోలవరం ఎత్తు తగ్గించి రెండు లక్షల ఎకరాలను కాపాడాలని భట్టి విజ్ఞప్తి చేశారు. వరద జలాల వాటా తేలిన తర్వాతే బనకచర్ల ప్రస్తావన తీసుకు రావాలి తప్ప అప్పటి వరకు తీసుకు రావాల్సిన పని లేదన్నారు. పదేళ్ల పాటు బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి సందర్భంలోనూ జవహర్ ఎత్తిపోతల పథకం కోసం ప్రయత్నం చేశానని కానీ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మధిర నియోజక వర్గంలో ఆయకట్టు చివరి రైతుల బాధలు, ఇబ్బందులు గత ప్రభుత్వానికి అర్థం కాలేదన్నారు. 30 గ్రామాలకు సాగునీరు రావాలంటే ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి ఉండేదని భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పుడు రెండవ జోన్‌కు తీసుకు రావడంతో పాటు జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించే అవకాశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగర్ ఎడమ కాలువపై జరుగుతున్న అన్యాయాన్ని వివరించి మధిర ప్రాంతాన్ని సాగర్ రెండవ జోన్‌లోకి తీసుకు రావడం జరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు.ఈ పథకానికి రూ. 600 కోట్లు ఖర్చు అవుతుందని 30వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మధిర నియోజక వర్గంలో ఐదు మండలాలు ఉండగా ప్రతి రెండు మండలాల మధ్య ఒక ఏరు పారుతుందని ఆయన గుర్తు చేశారు. కట్టలేరు, వైరా నదిపై నీటి పథకాలను ఏర్పాటు చేసుకున్నామని ఆయన తెలిపారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు ఖమ్మం జిల్లా వ్యవసాయ పరిస్థితులు దారుణంగా ఉండేవని భట్టి విక్రమార్క గతాన్ని గుర్తు చేశారు. జవహర్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు వచ్చిన మంత్రులకు మధిర ప్రాంత రైతాంగం ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నడుమ స్వాగతం పలికారు.

# వైద్యుల అలసత్వం.. రోగుల ఇక్కట్లు..!






**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** స్పెషలిస్ట్ క్యాంపులో రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ లు లేనందున వారిని నియమించే వరకు కార్మికుల రోగుల అవసరాలు తీర్చడానికి విజిటింగ్ స్పెషలిస్ట్ డాక్టర్లను రప్పించమని సింగరేణి కార్మిక యూనియన్ ఏఐటీయూసీ కోరగా అందుకు సానుకూలంగా స్పందించిన యాజమాన్యం అన్ని ఏరియాలకు స్పెషలిస్ట్ డాక్టర్ లు రావడానికి తగిన ఏర్పాటు చేశారు. ఈ రోజు కొత్తగూడెంలోని ప్రధాన ఆసుపత్రికి కార్డియాలజి, న్యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో యురాలజీ విభాగాలకు చెందిన డాక్టర్ లు ఉదయం సమయానికి రావాల్సి ఉండగా మ॥ 12 గంటల వరకు రాకపోవడంతో 8 గంటల నుండి పేర్లు నమోదు చెసుకొన్నారు.ఎల్లందు, మణుగూరు, ఇతర ప్రాంతాల నుండి రోగులు షుమారు 200 మంది తిండి తిప్పలు లేక వారు, వారి వెంట వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న సింగరేణి యాజమాన్యం ఈ క్యాంపుల్లో రోగులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. పరీక్షలకు ఎక్కువ సమయం పడుతుంది రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చూడాలి. అల్పాహారం, భోజనం తదితర వాటిని సమకూర్చాలి. అదే విధంగా బయటినుండి వచ్చే డాక్టర్ లు ఉదయం 8 గంటలకే వచ్చే విదంగా చూడాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ నెంబర్ వంగా వెంకట్ ఒక ప్రకటనలో యజమాన్యాన్ని కోరారు.

# కూసుమంచి ఎస్ మార్ట్‌లో సిండికేట్‌గాళ్ల ఘరానా మోసం

**-కాలం చెల్లిన వాటర్ వాటిల్ అమ్మకం అంటూ సోషల్ మీడియాలో వైరల్**






**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలో ఎస్ మార్ట్‌లో కొందరు సిండికేట్ గాళ్లు కాలం చెల్లిన తినుబండారాలు డ్రింక్స్ ఇంకా వాటర్ బాటిల్స్‌ను అమ్మకాలు చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై కాలం చెల్లిన ఐటమ్స్ అంటగడుతున్నారని, ఇందులో పుట్ ఐటమ్స్ కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అవి తింటే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నా కూడా ఎస్ మార్ట్ వారు అమ్మడం విడ్డూరం. దీంట్లో కొందరి రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో ధైర్యంగా కాలం చెల్లిన వస్తువులను విక్రయిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 4 నెలలు దాటిన కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్ ఉండటంతో షాప్‌లో ఉంచిన స్టాక్ కొన్ని అలాగే ఉండిపోయాయి. దీంతో ఎస్ మార్ట్ షాప్ యాజమానులు తాము నష్టపోతామన్న కారణంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కాలం చెల్లిన వస్తువులను తినుబండారాలను ఎస్ మార్ట్‌లో అమ్మకం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**పుడ్ ఇన్స్పెక్టర కిరణ్ కుమార్ వివరణ....**

కూసుమంచి ఎస్ మార్ట్‌లో కాలం చెల్లిన తినుబండారాలు కానీ వాటర్ బాటిల్స్ గాని అమ్మినట్లయితే వాటినీ అమ్మిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# మనిషికో రీతి.. బయ్యారం పోలీసుల రీతి..!



(మొదటిపేజీ తరువాయి)

తరలించారు. ఏం జరిగిందో కానీ పినపాక ప్రధాన రహదారిపై పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను కొన్నింటిని వెంటనే విడుదల చేశారు. దీని వెనక అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తుంది. వారి ఒత్తిడి కారణంగానే అక్రమంగా ఇసుక తరలిస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు. ఈ తతంగం చాలా రోజులుగా జరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం స్పందిచడం లేదు. ఒకవేళ ఇసుక రవాణా సక్రమమే అయి అనుమతులు ఉంటే అసలు పోలీస్ స్టేషన్‌కు ఎందుకు తరలించారన్న ప్రశ్నకు పోలీసులు సమాధానం చెప్పలేని పరిస్థితి. మొత్తంగా బయ్యారంలో గత కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న తీరుపై విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పోలీస్ స్టేషన్లకు వచ్చిన ట్రాక్టర్లను వదిలేసిన ఘటనకు సంబంధించి పినపాక ఎస్ఐని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. సామాన్యులకు ఒక రీతి. అధికార పార్టీగా మరో రీతిగా వ్యవహరిస్తున్న ఈ ఘటనకు సంబంధించి విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

# హెచ్‌ఎంఎస్‌తో కవిత దోస్తీ

(మొదటిపేజీ తరువాయి)

సాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం బిఆర్‌ఎస్ పార్టీలోని కొందరు నేతలను ప్రత్యక్షంగా, పరోక్షంగా విమర్శించిన కవిత అంతు చిక్కని రీతిలో అటు కాంగ్రెస్‌ను అప్పుడప్పుడు బిజెపిని కూడా విమర్శిస్తున్నారు. కవిత వైఖరి బిఆర్‌ఎస్‌కు తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఈ క్రమంలో బిఆర్‌ఎస్ అనుబంధ సంస్థ టిబిజికెఎస్‌ను కాదని హెచ్‌ఎంఎస్‌తో దోస్తీ కడుతున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఇటీల తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సమావేశంలో కవితను గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి తొలగించారు. దీనితో ఆమె హెచ్‌ఎంఎస్‌తో దోస్తీ కడుతున్నట్లు ప్రకటించడమే కాగా మెడలో హెచ్‌ఎంఎస్ యూనియన్ కండువా వేసుకుని మీడియా సమావేశంలో పాల్గొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో సింగరేణిలోని అవినీతి, నిధుల దారి మళ్లింపుకు సంబంధించి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న కవిత ఇప్పుడు సింగరేణి కాంగ్రెస్‌కు కరెప్షన్ గనిగా మారిందని ఆరోపించింది. సింగరేణిని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తుందని దానిని అడ్డుకునేందుకు దసరా తర్వాత సింగరేణి యాత్ర చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ కుమార్తెగా, మాజీ ఎంపిగా ఉన్న కవిత కుటుంబ మనస్పర్థల కారణంగా బిఆర్‌ఎస్‌కు దూరంగా ఉన్నారు. కవిత వైఖరి బిఆర్‌ఎస్‌కు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది. ఎప్పుడు ఏమి ప్రకటన చేస్తుందో, పార్టీకి ఏవిధంగా నష్టం చేస్తుందో అర్థం కాని స్థితిలో బిఆర్‌ఎస్ నాయకత్వం ఉంది. ఈ దశలో పార్టీ నుంచి తొలగించలేక, పార్టీలో ఇముడ్చుకోలేక ఇబ్బందిపడుతున్న బిఆర్‌ఎస్ నాయకత్వానికి ఇప్పుడు కవిత నిర్ణయం మరి కొంత ఇబ్బందిని కలిగించే అంశమే. హెచ్‌ఎంఎస్‌తో కవిత దోస్తీ పట్ల బిఆర్‌ఎస్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.


# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**



**ప్రజాపక్షం/పినపాకః** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం చేత కాదని, ప్రతిపక్ష నాయకుడికి అసెంబ్లీకి వచ్చి అధికార పార్టీని అడిగే తీరిక లేదని ఇద్దరూ పేదలను దోచుకునే వారిని అధికార, ప్రతిపక్షాలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్ లో జరిగిన భారీ దివ్యాంగుల మహా గర్జన సన్నాహాక సభకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని అసమర్థ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అని మండిపడ్డారు. ఎన్నికల హామీలు ఇచ్చిన విధంగా దివ్యాంగులకు 6000, వృద్ధులకు 4000 పెన్షన్ పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. చేయూత పింఛన్ దారులకు ఇచ్చే పింఛన్ వెంటనే పెంచి ఇవ్వాలని, ముఖ్యంగా నేను పోరాటం చేసే సమయంలో ఎర్రజెండా పార్టీలైన సిపిఐ, సిపిఎం నాకు అండగా ఉందని తెలిపారు. ఏపీలోనూ సీఎం చంద్రబాబు దివ్యాంగులకు నెలకు రూ.15 వేలు ఇస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మేనిఫెస్టిలో ప్రకారం ఇచ్చిన అమలు చేయలేదన్నారు. దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లక్షలాది మంది హైదరాబాదులో జరిగే ఈ సభకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వల్లేపోగు వెంకటేశ్వర్లు, సోంపల్లి తిరుపతి, ప్రజా గాయకులు సిద్దెల హుస్సేన్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజలు, దివ్యాంగులు, వృద్ధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన ఎంఎల్ఏ పాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మోరంపల్లిబంజర్ గ్రామానికి చెందిన కర్నాటి పవన్‌కుమార్‌ను ఆదివారం పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఇటీవల పవన్ కాలుకు సర్జరీ జరగడంలో ఆయనను పరామర్శించారు. అనంతరం సోంపల్లి గ్రామ పంచాయితీలో గల బుడ్డగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు కుమార్తె తాటి అఖిల ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన పరామర్శించారు. మృతి చెందిన అఖిల పాల్వంచ కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నది. వీరాంజనేయులు కుటుంబానికి కొండంత అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అఖిల మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, మాజీ సొసైటీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మోరంపల్లిబంజర్ మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మి నారాయణరెడ్డి, నాయకులు సోము ఆదిరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, ఎర్రగొర్ల శ్రీనివాసరావు, నంద్యాల కన్నయ్య, బుడ్డగూడెం గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి చిత్రపటానికి నివాళి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు గ్రామానికి చెందిన బీరెల్లి శేషయ్య తల్లి బీరెల్లి లక్ష్మి దశ దిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ముందుగా బీరెల్లి లక్ష్మి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, సొసైటీ మాజీ ఛైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, వెంగాన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, నాయకులు ఎల్లంకి చిన్న నాగేశ్వరరావు, దుద్దుకూరి నరసింహారావు, తెలంగాణ ఉద్యమకారులు వేల్పుల నరసింహారావు, వరస్తపురపు శ్రీను, కొండం జోగారావు, బానోతు రామ్ జి, భూపతిరావు, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ హరీష్, మోదుగు సుగుణరావు, ఎండపల్లి చిట్టిబాబు, మంద కిషోర్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో ఎంఎల్ఏ రాందాస్ నాయక్ పర్యటన

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** నేడు మండలంలో ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ఉదయం 9:30గంటలకు జూలూరుపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 2 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల మధ్య గల పిల్లలకు నులిపురుగుల ట్యాబెట్లు పంపిణీ కార్యక్రమానికి ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్ హాజరు కానున్నాట్లు తెపారు. జూలూరుపాడు మండల వ్యాప్తంగా ఉన్నటువంటి 2 నుండి 19 సంవత్సరాల మధ్య గల పిల్లలు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొని, నులిపురుగుల మాత్రలు స్వీకరించాలని కోరారు.

## రైతు భీమాకి దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** 5 జూన్ 2025 వరకు కొత్త పట్టాదారు పాసుబుక్ వచ్చి, ఆధార్ ప్రకారం 18 నుండి 59 సంవత్సరాల వయస్సు కలిగిన రైతులు రైతు భీమా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణ్ బాబు అన్నారు. ఇది వరకు రైతు భీమా చేసుకొని రైతులు కూడా రైతు భీమా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు భీమా దరఖాస్తు చేసుకోవడానికి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి నామినేషన్, దరఖాస్తు ఫామ్, రైతు యొక్క ఆధార్ కార్డు, నామిని యొక్క ఆధార్ కార్డ్, పట్టాదార్ పాసుబుక్ సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి 13 ఆగస్టు 2025 చివరి తేదీ అని తెలిపారు. 14 ఆగస్టు 1966 నుండి 14 ఆగస్టు 2007 మధ్య పుట్టిన రైతులు మాత్రమే రైతు భీమాకి అర్హులని, అలాగే ఇది వరకు రైతు భీమా చేసుకున్న రైతులు ఎవరైనా నామినీ నీ మార్చదలచుకుంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని ఆగస్టు 12లోపు సంప్రదించాలన్నారు. కావున రైతులు అందరూ త్వరతిగతిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మంజుల మదన్‌లాల్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం అష్టగుర్తి గ్రామానికి చెందిన కందుల ఓంకార్ రమా దేవి దంపతుల కూతురు భావజ్ఞ కుమారుడు నిశిత్ రాణా ఓణీల పంచకట్లు కార్యక్రమంలో పాల్గొన్న బానోతు మంజుల మదన్‌లాల్ చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మదన్‌లాల్ ప్రతిఒక్కరిని ఆప్యాయతగా పలకరిస్తూ అందరితో మమేకమయ్యారని అన్నారు. ఆశీర్వదించిన వారిలో చోడే శ్రీలత, కామినేని శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరరావు, మేదరమెట్ల రాము, పాముల వెంకటేశ్వర్లు, కిలారి కిరణ్‌కుమార్, అయినాల కనకరత్నం, అప్పం సురేష్, తన్నీరు కిషోర్, కారుకొండ బోస్, గుజ్జర్లపూడి దేవ రాజ్, తోటకూర వీరబాబు యాదవ్ తదితరులు ఉన్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు

**-త్వరలో సీతారామ పూర్తి**
**-ఏడాదిలో జవహర్ ఎత్తిపోతల పథకం**





**ప్రజాపక్షం/మధిర :** ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. వైరా నదిపై రూ. 600 కోట్లతో నిర్మించే జవహర్ ఎత్తిపోతల పథకానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విక్రమార్క మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి కృష్ణా, గోదావరి జలాలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. నాగార్జున సాగర్ రెండవ జోన్ చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు జవహర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నామని ఈ ఏడాదిలో ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుందన్నారు. మధిర నియోజకవర్గంలో మూడు నదులు ప్రవహిస్తున్నాయని ఈ నీటిని సద్వినియోగం చేసుకుంటామని ఆయన తెలిపారు. పాలేరు నుంచి సత్తుపల్లి వరకు నాగార్జున సాగర్ ద్వారానే పంటలు పండుతున్నాయని ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీటిని అందించే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా 120 రోజుల్లో నాలుగు టిఎంసిల నీటిని ఎత్తిపోసేలా పథకం రూపొందించడం జరిగిందని 190 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంటుందన్నారు. రూ. 45 కోట్లు భూ సేకరణకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. 13వేల ఎకరాలు మధిర మండలంలో, 19వేల ఎకరాలు ఎర్రుపాలెం మండలంలో ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీహరి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ సిఈ రమేష్ పాల్గొన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి




**ప్రజాపక్షం/మణుగూరు:** పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో మణుగూరు లోని మౌనిక రెస్టారెంట్ పైన హాల్లో పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ జరిగిన అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనా పై ఇజ్రాయిల్ అమానుషంగా దాడులు చేస్తూ, మారణ హోమం సృష్టిస్తూ, పాలస్తీనీయుల జాతి హననానికి పూనుకున్నదని, దానిలో భాగంగానే పిల్లలు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా సామాన్య ప్రజలను విచక్షణారహితంగా చంపుతూ ఆహారం, మందులు అందకుండా చేసి అమానుషంగా ప్రవర్తిస్తుందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. తమ జాతి రక్షణ కోసం, తమ దేశ రక్షణ కోసం పోరాడుతున్న పాలస్తీనాకు సంఘీభావం తెలపాలన్నారు. పాలస్తీనీయుల జాతి హననాన్ని ఆపాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని, అమెరికా భారత్ పై సుంకాలు విధించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై మణుగూరులో ఒక ర్యాలీ చేయాలని ఆలోచన చేయడం జరిగిందని, ఇందు కోసం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మణుగూరులో స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో అన్ని పార్టీలు, ప్రజాసంఘాల తోటి విస్తృతస్థాయి సమావేశం జరిపి నిర్ణయం తీసుకోవాలని, నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) నాయకులు ఆర్. మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కుంట లక్ష్మణ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సాగర్ అన్న, సిపిఐ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు వట్టం నారాయణ, వాసిరెడ్డి చలపతిరావు, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) నాయకులు మల్లెల రామయ్య, పి. సంజీవరెడ్డి, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.నాగేశ్వరరావు, పి. నాగర్జున, మణుగూరు మండల ముస్లిం మిల్లత్ కమిటీ నాయకులు ఎండి. సిరాజ్ పాషా, ఎండి. బాబా, జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు ఎండి రఫీ, ప్రజాస్వామిక వాది సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగలొచ్చారు.. దోచుకుపోయారు..





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దొంగలు వచ్చారు, దోచుకుపోయారు. దొంగలు చేస్తున్న ప్రతి పనిని గమనిస్తుండటం తప్ప ఏమీ చేయాలని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు గృహాల యజమానులు. సీసీ కెమెరాల్లో దొంగలు ఇంట్లో దర్జాగా తిరుగుతున్న వీడియోని వీక్షిస్తూ లబోదిబోమనటం తప్ప ఏమి చెయ్యలేకపోయారు. జరుగుతున్న తతంగమంతా కళ్ళ ముందు కనిపిస్తున్నా, సీసీ కెమెరా వైపు చూసిన దొంగలు తాము ఎక్కడ పట్టుబడతామోనని ముఖాలు దాచుకుంటూ మరి తమ పని కానిజేశారు. ప్రస్తుతానికి గృహాల యజమానులు అందుబాటులో లేని కారణంగా నగదు, బంగారం, వెండి లాంటి వస్తువులు ఎంత చోరీకి గురయ్యాయి అనేది అంచనాకు రావటం కష్టంగా మారింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 2 నుండి 4 గంటల మధ్య సత్తుపల్లి పట్టణ శివార్లలలో గల సింగరేణి క్వార్టర్స్ లోని 5 ఇండ్లలోకి గుర్తు తెలియని వ్యక్తులు (దొంగలు) ప్రవేశించి తాళాలు పగలగొట్టి ఇంటిలోకి చొరబడి దొంగతనం చేయడం చేసినట్లు తెలిపారు. దొంగతనంలో సుమారు ముగ్గురు అంత కన్నా ఎక్కువ వ్యక్తులు పాల్గొని ఉండొచ్చని అనుమానిస్తూ దర్యాప్తు ప్రారంభించినట్లు సిఐ శ్రీహరి తెలిపారు. వరుస సెలవుల కారణంగా ఇళ్ళకి తాళాలు వేసి ఉంటారని పక్కా ప్లాన్ తోనే తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ గా చేసుకుని దొంగతనాలు జరిగినట్లుగా అనుమానిస్తున్నామన్నారు. ఇళ్ళకు తాళాలు వేసి వెళ్లిన వారు రాగానే దరఖాస్తులు తీసుకొని కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేస్తామన్నారు. ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊళ్లకు వెళ్లే ముందు సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో ఇన్ఫార్మ్ చేయాలని సూచించారు. ఇంటిలో లేని సమయంలో విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీ, కొత్త కాలనీల తదితర ఏరియాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే దొంగతనాలను అరికట్టడానికి లేదా ఛేధించడానికి ఆస్కారం ఉంటుంది తెలిపారు. అపరిచిత వ్యక్తులు లేదా అనుమానిత ప్రవర్తన గల వ్యక్తులు కనిపించిన సత్తుపల్లి పోలీస్ కి డయల్ 100 ద్వారా కానీ, 8712659168, 8712659169, 8712659167 ఫోన్ నెంబర్స్ కి సమాచారం అందించాలన్నారు.

# అనుమతులు గోరంత.. తోలకాలు కొండంత..!

**- సెలవు రోజులే లక్ష్యంగా**
**- చెలరేగుతున్న అక్రమార్కులు**
**- పట్టించుకోని అధికారులు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అనుమతులు గోరంత తీసుకొన్న లారీ యాజమానులు కొండంత తోలకాలు చేస్తూ ప్రభుత్వ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. దీనితో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. అధికారులు పట్టించుకోక పోవటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. బూర్గంపాడు మండల జింకలగూడెం గ్రామ సమీపంలో గల సీతారామ ప్రాజెక్టు కట్టకు సంభంధించిన మట్టిని తరలించేందుకు ఈ నెల ఒకటవ తేదీన పాల్వంచకు చెందిన కొందరు లారీ యాజమానులు లక్ష్మిదేవిపల్లి మండలానికి రవాణా చేసేందుకు అనుమతులు తీసుకొన్నారు. జింకలగూడెం దగ్గరలో సీతారామ కట్ట మట్టిని ఈ నెల 2వ, తేదీ నుండి లక్ష్మిదేవిపల్లి మండలం పోలీస్ స్టేషన్ సమీపంలోకి తరలిస్తున్నారు. కాగా తీసుకొన్న అనుమతులు మాత్రం రెండు రోజుల వరకు సుమారు 300 ట్రిప్పులు మాత్రమే అని సమాచారం. కానీ ఈ నెల 9వ, తేదీ వరకు నిరంతరాయంగా తోలకాలు చేస్తూనే ఉన్నారు. తీసుకొన్న అనుమతులను అడ్డం పెట్టుకొని పాల్వంచ మండల వ్యాప్తంగా వివిధ ప్రదేశాలకు ఒక్కో టిప్పర్ సుమారు 5 వేయిల చొప్పున రాత్రి పగలు తేడా లేకుండా జోరుగా మట్టి రవాణా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరుసగా వచ్చిన మూడు రోజుల సెలవు రోజులను లక్ష్యంగా చేసుకొన్న అక్రమార్కులు మరింత రెచ్చిపోతూ దర్జాగా మట్టిని తరలిస్తూ అధికారులు ఇచ్చిన అనుమతులను భేఖాతర్ చేస్తూ అందిన కాడికి దోచుకొంటున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సమాచారం అందించినా పట్టించుకోని అధికారుల తీరుపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**- పరిశీలించి చర్యలు తీసుకొంటాం :**

ఈ విషయంపై తహశీల్దార్ దారా ప్రసాద్ వివరణ కోరగా .. మట్టి రవాణా కోసం అనుమతులు తీసుకొన్నది వాస్తవమే అన్నారు. ఎక్కడ నుండి ఎక్కడి వరకు, ఎన్ని రోజుల వరకు అనే వివరాలను పరిశీలించి తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# కళ్లెదుటే ఆక్రమణలు..!

**-ఆక్రమణలను అడ్డుకునేది ఎవరు..?**
**-ఫుట్ పాత్‌పైనే షాపులు**



**ప్రజాపక్షం/కరకగూడెం:** వాహనాలు రై, రైమంటూ తిరగటానికి డబల్ రోడ్డు ఉంది కానీ, పాదచారులు నడిచి వెళ్ళటానికి మూడు అడుగుల రోడ్డు కనిపించడం లేదని వాపోతున్నారు. పాదాచారులు నడవలేని విధంగా కరకగూడెంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్‌పై షాపులు నిర్మించడంతో రహదారి నుండి విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, పాదాచారులు నడిచి వెళ్ళాలి అంటే ఏ సమయంలో రైమంట్ ఎవ్వరూ వచ్చి వారి వాహనాలను తగిలిస్తారో అన్న భయంతో పాదచారుల ప్రమాదాలకు గురి కాకుండా సురక్షితంగా నడిచి వెళ్లేందుకు ఏ టైంలో ఏం జరుగుతుందో అని భయంలో ఉన్నారు. ఫుట్ పాత్ ల ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు వాటిని పాదాచారుల కంటే వ్యాపారులు మొత్తం ఆక్రమించుకొని ప్రమాదాలకు గురైన చూస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వాటిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. సక్రమంగా వినియోగించటంతో కరకగూడెం నుండి మణుగూరు, వరంగల్, గుండాల తదితర ప్రాంతాలకు మహా భారీ వాహనాలు, కార్లు, బస్సులు భారీ సంఖ్యలో తిరుగుతుండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంత రద్దీ రహదారిపై ప్రజలు నడిచి వెళ్ళాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ పాత్ ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని, చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజాసంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు సంబందిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని అదనుగా భావించిన ఆక్రమణ దారులు ఫుట్ పాత్ లతో పాటు రొడ్డును సైతం ఆక్రమించి ఎంచక్కా కిరాయికి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. అసలే ఇది ప్రధాన రహదారి, పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఫుట్ పాత్ లను పూర్తిగా మూసి వేసి, అక్రమంగా వ్యాపారం చేసుకుంటున్నా అధికారులు చర్యలకు జంకుతుండటం పల అనుమానాలకు తావిస్తుంది. ఒక్కోసారి రోడ్డుపై నడక సాగించే పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం లక్షలకు లక్షలు వెచ్చించి ఫుట్ పాత్ నిర్మించినా, ఇవి ఆక్రమణకు గురి కావడంతో పాదచారులకు నిరుపయోగంగా మారాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఫుట్ పాత్ ఆక్రమణ దారులపై తగిన చర్యలు తీసుకోవాలని పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సబ్ డివిజనల్ అధికారి




**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల పోలీస్ స్టేషన్ ను సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఆదివారం సందర్శించారు. సందర్శనలో భాగంగా పాల్వంచ డిఎస్పి సిబ్బంది అందరికీ పోలీస్ స్టేషన్ యొక్క నిర్వహణ, రికార్డుల తనిఖీ, కేసు విచారణ, సిబ్బంది యొక్క అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం అశ్వారావుపేట సిఐ, దమ్మపేట ఎస్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఎన్ఆర్‌కి విద్యారత్న అవార్డు

**-రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం పట్ల అభినందనలు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులకు ఆదివారం హైదరాబాద్‌లో అతిరథ మహారథులు హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ ఛైర్మన్ కొంపల్లి సత్యారాయణ, హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ ఇంచార్జి బీరెల్లి చంద్రశేఖర్ గుప్తా, స్వర్ణగిరి దేవాలయ ఫౌండర్ మన్నెపల్లి రామారావు చేతుల మీదుగా విద్యారత్న అవార్డును బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్‌కు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్‌ని ఎంపిక చేయడం మాకెంతో సంతోషంగా ఉందన్నారు. బిఎన్ఆర్ ఏజెన్సీ ప్రాంతంలో గత 30 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేష కృషి చేసి వేలాది మంది విద్యార్థుల ఉన్నతికి మార్గదర్శి అయిన మహోన్నత వ్యక్తి, రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యారత్న అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా గురు బ్రహ్మ అవార్డును, ఉత్తమ ఉపాధ్యాయులుగా బంగారు నంది అవార్డును అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. నేడు విద్యారత్న అవార్డును అందుకున్న సందర్భంగా బిఎన్ఆర్‌ని బ్రిలియంట్ హై స్కూల్, జూనియర్ కాలేజ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్దులు ఇంకా మరెన్నో ఇలాంటి గొప్ప గొప్ప పురస్కారాలను పొందాలని ఆకాంక్షించి, అభినందనలు తెలిపారు.

## అయోధ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దలు, అత్యంత ఆత్మీయులు కీ.శే. బొల్లోజు అయోధ్య చారి కుటుంబ సభ్యులను ఆదివారం వారి స్వగ్రామమైన రామానుజవరం గ్రామంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆయా మండల పార్టీ నాయకులు, శ్రేణుల సమన్వయంతో పరామర్శించారు. ఈ సందర్భంగా అయోధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆత్మీయ నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢసాను భూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిపిఐ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు, వివిధ పార్టీల మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు, యువజన కాంగ్రెస్ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఇరు పార్టీల సోషల్ మీడియా సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కార్టూన్ పోటీలో సత్తా చాటిన పాల్వంచ వాసి




**ప్రజాపక్షం/పాల్వంచ :** విశాఖపట్టణం నార్త్‌కోస్ట్‌లో ఆంధ్రా కార్టూనిస్ట్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్టూన్ పోటీల్లో పాల్వంచకు చెందిన షేక్ సుభాని సత్తా చాటాడు. ఆయన గీసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి లభించినది. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ మాజీ ఎంఎల్ఏ చెరువు రామజోగయ్య, సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ శశిభూషన్‌ల చేతుల మీదుగా షీల్డ్‌తో పాటుగా నగదు పురస్కారాన్ని అందుకొన్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారు రెండువందల మంది పాల్గొన్న పోటీలలో ప్రత్యేక బహుమతి సాధించిన సుభానిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు, కార్టూనిస్టులు రామశర్మ, టిఆర్ బాబు, లాల్, ఓంకార్, జెన్నాలతో పాటుగా ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కార్టూనిస్ట్‌లు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు ఉచితంగా ఓపెన్ డిగ్రీ విద్య

**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యలో వెనుకబడ్డ గిరిజన విద్యార్థులకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓపెన్ డిగ్రీ విద్యను ఉచితంగా అందించనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. పద్మ తెలిపారు. ఆదివారం పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ.. ఉచిత విద్య కోసం ఈ నెల 13వ, తేదీ వరకు విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్స్‌లర్ గంటా చక్రపాణి సూచించారని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సుకు రూ. 3200/ల వరకు ఫీజు ఉంటుందన్నారు. గిరిజన విద్యార్థులకు భారం కాకూడదనే కేవలం రూ. 500/ల నామమాత్రపు ఫీజుతోనే అడ్మిషన్ ఇవ్వనున్నామని అన్నారు. రెగ్యులర్ ఇంటర్ మీడియెట్,ఓపెన్ ఇంటర్ పాసైన వారు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులన్నారు. అలాగే పాలిటెక్నిక్, ఐటిఐ, డిప్లమా రెండు సంవత్సరాల కోర్సులు పాసైన విద్యార్థులు సైతం ధరఖాస్తుకు చేసుకోవచ్చన్నారు.WWW.braouonline.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7382929727 కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.. సమావేశంలో కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా బోనాల పండుగ



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి పాండురంగాపురంలో ఆదివారం బోనాల పండు గను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని రాగా పోతురాజు, గ్రామ దేవతలు వేశాధారణలతో ముందు నడిచారు. దేవాలయం వరకు ఊరెంగింపుగా సాగారు. ఈ సంధర్భంగా డిజే పాటలు మారుమ్రోగాయి. ముత్యాలమ్మ అమ్మవారి పాటలకు యువత నృత్యాలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో గ్రామం చల్లగా ఉండాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. వేడుకలు, ఉత్సవాలు ప్రజల మధ్యన ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా ఒక మొక్కను నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించి భావి తరాలకు అందించాలని కోరారు. అపుడే వాతావరణ సమతుల్య పెరుగుతుందని దీనితో వర్షాలు కురుస్తాయని తెలిపారు. చెట్లు మానవ మనుగడకు జీవనాధారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గుగులోత్ బాలు, భూక్యా హుస్సేన్ నాయక్, ఇస్లావత్ దేవి, బానోత్ లక్‌పతి, జగదీష్ కుమార్, సోడి, గుగులోత్ భద్రు నాయక్, బానోత్ కుమార్, లక్ష్మణ్, అంగోత్ హుస్సేన్, గుగులోత్ కిషోర్, బానోత్ చందర్, కుమార్, భావ్‌సింగ్, భూక్యా మంగ్య నాయక్, హరి, జబ్రులాల్ తదితరులు పాల్గొన్నారు.

# భయపెడుతున్న దొంగలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇటీవల కాలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తాళాలు వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి పాల్పడుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. శుక్రవారం తెల్లవారుజామున ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని గొల్లగూడెంలో మారణాయుధాలు, ముఖానికి ముసుగులు ధరించిన ముగ్గురు దొంగలు సంచరించడం సిసి కెమెరాల్లో రికార్డయింది. ఒక తాళం వేసి ఉన్న ఇంట్లోకి వెళ్లి రావడం కూడా కెమెరాలో రికార్డు కాగా ఎటువంటి చోరీ జరగలేదు. కానీ సత్తుపల్లిలో శనివారం జరిగిన దొంగతనాల్లో ఇక్కడ పాల్గొన్న ముగ్గురి మాదిరి అక్కడ కూడా ముగ్గురు దొంగతనానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరు వారు ఒకే రీతిగా ఉన్నారని బయట నుంచి దొంగల ముఠా దిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి మారణాయుధాలతో దొంగలు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## కరకగూడెంలో బోనాల సందడి

పలు ఆలయాల సందర్శన



**ప్రజాపక్షం/కరకగూడెం:** బోనాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ ఆనందోహోత్సాహాలతో కుటుంబ సభ్యులు కలిసి ఉండాలని గ్రామ పెద్ద మనుషులు దుర్గం ముసలయ్య, సంజీవ, కన్నయ్య, అన్నారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆయన ఆదివారం తాటిగూడెంలోని ప్రముఖ ఆలయాలైన ముత్యాలమ్మ తల్లి దేవాలయాలను సందర్శించారు. ఆలయాల వద్ద కమిటీ నిర్వహకులు దుర్గం ప్రేమ్ స్వాతి స్వాగతం ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజాధికార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దమనుషులు మాట్లాడుతూ బోనాల ఉత్సవాల నేపథ్యంలో కరకగూడెం మండలం లోనీ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తిస్థాయి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఆదివారం, సోమవారం రోజుల్లో తాటిగూడెం, కరకగూడెం బట్టుపల్లి, కలవాల నాగారం అనంతరం జరిగే ఉత్సవాలను వీక్షించడానికి లక్షలాది మంది ప్రజలు వస్తుంటారని తెలిపారు. ఆదివారం బోనాలు సమర్పించడానికి మండలానికి సంబంధించిన చుట్టాలు పట్టాలు అందరూ వచ్చి, దేవాలయాలను సందర్శిస్తుంటారని తెలిపారు. వారి భద్రతోపాటు వచ్చివెళ్లే ప్రాంతాల్లోముత్యాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న ఎలాంటి అంతరాయాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ముత్యాలమ్మ టెంపుల్ ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రత్యేకంగా ప్రధాన ఆలయాలతో పాటు ఇతర ప్రాంతాల్లో మహిళా భద్రతకు వేస్తూ వారి రక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం జరిగే ఘటాల ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచే అక్కన్న ముత్యాలమ్మ టెంపుల్ దేవాలయ ఊరేగింపుతోపాటు ప్రధాన మార్గాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జిమ్మిడి ప్రకాష్, దుర్గం ముసలయ్య, జిమ్మిడి ప్రశాంత్, జాడి నాగరాజు, గోగు సాయి, దుర్గం పార్వతి, స్వాతి, సంధ్య, కళ్యాణి, సరిత, సాంబ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రైతుబీమా కొరకు దరఖాస్తు చేసుకోండి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** కొత్తగా పాస్‌బుక్ పొందిన రైతులు రైతుభీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏవిఎస్. ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 5 లోపు భూభారతి పోర్టల్ ద్వారా ధృవీకరించిన నూతన పట్టాదార్ పాస్‌బుక్/ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పొంది ఉన్న రైతులు రైతు భీమా కొరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తు సమర్పించడానికి రైతు వయస్సు ఆధార్ కార్డును అనుసరించి 18 59 సంవత్సరాల మధ్య ఉండాలని (14081966 నుండి 1408 2007) మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే సంబంధిత ఏఈఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు సమర్పించడానికి ఆఖరి తేది ఆగస్టు 13, 2025 దరఖాస్తు ఫారంతో పాటు భూమి పాస్‌బుక్ జిరాక్స్, రైతు ఆధార్ కార్డు, నామినీ యొక్క ఆధార్ కార్డు జతపరచి రైతు స్వయంగా వచ్చి సమర్పించాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు వారి వివరాలను సరిచేసుకుని, ఏవేని మార్పులు చేర్పులు లేదా నామిని మార్పు మొదలైనవి ఉంటే ఆగస్టు 12, 2025 లోగా ఏఈఓలను సంప్రదించాలని ఏఓ తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని సిరిపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద పేకాట ఆడుతున్న 13 మందిని వైరా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుప్పాల రామారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా కెజి సిరిపురం, స్టేజిపినపాకకు చెందిన 13 మందిపై కేసు నమోదు చేసి వారి వద్ద రూ.4250ల నగదు, 5 బైక్స్, 2 స్కూటీలను స్వాధీనం చేసుకున్నామని పంచనామా నిర్వహించి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## పౌరులకు రాజ్యాంగ విద్యను అందించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పౌరులందరికీ ఆయా స్థాయిల్లో రాజ్యాంగ విద్యను అందించాలని సిపిఎం రాజకీయ విద్యా విభాగం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు కొండలరావు తెలిపారు. ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో రాజ్యాంగ అధ్యయనం అనే జరిగిన సెమినార్‌లో కొండలరావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో రాజ్యాంగం గురించి విస్తృతంగా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగాన్ని వివరించడమంటే ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని పటిష్ట పర్చడమేనని ఆయన తెలిపారు. రాజ్యాంగంపై అవగాహన కలిగితే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. రాజ్యాంగంపై భిన్న వాదనలు లేకున్నా అమలుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయని ఇప్పుడొస్తున్న రాజ్యాంగ సవరణలు ప్రజల హక్కులను హరించేవిధంగా ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. రాజ్యాంగంలోని ప్రధాన భూమిక పోషించే చట్టసభలు కార్యనిర్వహక వర్గం, న్యాయ వ్యవస్థల మధ్య సమన్వయం దెబ్బతిన్నదని ఇది లేకుంటే భవిష్యత్తులో విపత్కర పరిణామాలను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. రాజ్యాంగ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొండలరావు కోరారు. తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో జొన్నలగడ్డ సునీత, బంధం శ్రీను, అప్పాచారి, నరేష్, అప్పారావు, బత్తినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఆదివారం ఖమ్మం కూరగాయల మార్కెట్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా॥ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి జ్యూట్ బ్యాగులు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గా నాగేశ్వరరావు, ఎన్. కృష్ణమూర్తి, డా॥ డిపిసిరావు, కె. విశ్వేశ్వరరావు, కె. వర్ధన్‌రావు, వి. వెంకయ్య, అయ్యదేవర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రావణమాసం బోనాలు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆదివారం ఖమ్మం నర్సింహా స్వామి గుట్ట ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. నర్సింహా స్వామి గుట్ట నుంచి ముత్యాలమ్మ తల్లి గుడి వరకు ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఇటువంటి ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతకు దారి తీస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 52వ డివిజన్ ఇంచార్జి సిహెచ్ దుర్గానాథ్, ప్రాంత ప్రముఖులు గోనే కళావతి, రమణ, శోభారాణి, లక్ష్మి, మాధవ్, నిర్మల పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పరిధిలోని పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, జీడిపిపల్లి తదితర గ్రామాలలో ఆదివారం ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. మహిళా భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలతో పాల్గొని నూతన వస్త్రాలతో ప్రత్యేక పూజలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దకోరుకొండి, చిన్న కోరుకొండి, జీడిపి పల్లి తదితర గ్రామాలలో ముత్యాలమ్మ తల్లి ఆలయాల వద్ద భక్తులు కిక్కిరిశారు. ఆలయ కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాలకు చెందిన దేవరపల్లి వెంకటేశ్వరరావు, మట్టూరు రాజేష్, దేవరపల్లి అశోక్ అను ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషించి అవమానపరిచినందుకు వాచానాయక్ తండాకు చెందిన భానోత్ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయినట్లు ఎస్సై హరిత తెలిపారు. ఇట్టి కేసును ఏసీబీ రఘు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లుపేర్కొన్నారు. స్వాగత్ రెస్టారెంట్ వద్ద మేయర్ ఆగ్రో మందుల కంపెనీ యొక్క వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన విందులో పాల్గొన్న ప్రసాద్‌ను కులం పేరుతో దూషించడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఏసీపీ రఘు విచారణ చేపట్టారు.

## పలువురిని పరామర్శించిన మంజుల మదన్‌లాల్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సిరిపురం మాజీ ఎంపిటిసి, కాంగ్రెస్ నాయకులు మట్టూరి కృష్ణారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న బానోతు మంజుల మదన్‌లాల్ ఆదివారం వైరాలోని గంధం అపార్ట్‌మెంట్‌లో ఆయన నివాసారినకి వెళ్లి మట్టూరు కృష్ణారావును పరామర్శించారు. అనంతరం వైరా మున్సిపాలిటీ దిద్దిపూడి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు మోటపోతుల సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి సురేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు ఆమె అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో చోడే శ్రీలత, కామినేని శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరరావు, మేదరమెట్ల రాము, పాముల వెంకటేశ్వర్లు, కిలారి కిరణ్‌కుమార్, అయినాల కనకరత్నం, అప్పం సురేష్, తన్నీరు కిషోర్, కారుకొండ బోస్, గుజ్జర్లపూడి దేవరాజ్, తోటకూర వీరబాబు యాదవ్ తదితరులు ఉన్నారు.

## ఇసుక లారీ సీజ్

**ప్రజాపక్షం/వైరా:** ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రా నుండి రవాణా చేస్తున్న ఇసుక లారీని వైరా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పుప్పాల రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా తల్లాడ వైపు నుండి వైరా వైపు వస్తున్న ఏపి27టిజెడ్2497 లారీని తనిఖీ చేయగా ఇసుక లోడ్ ఉండగా ఎటువంటి అనుమతి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని వహన డ్రైవర్ బాలకృష్ణ యజమాని వెంకటేశ్వరరావు ఇట్టి రవాణాకు సహకరిస్తున్న వైరాకు చెందిన బానోతు కృష్ణలపై కేసు నమోదు చేయడం జరిగింది. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఆంధ్రా నుండి ఇసుక రవాణా జరిపితే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# రెపరెపలాడే విద్యార్థి విప్లవ పతాక ఏఐఎస్ఎఫ్

**-స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం**
**-విద్యార్థి ఉద్యమాల వేదిక ఏఐఎస్ఎఫ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అలుపెరుగని సమరశీల ఉద్యమాల వేదిక దేశానికి ఎందరో త్యాగధనులను అందించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో, తెలంగాణ ఉద్యమ పోరాట స్ఫూర్తితో నిత్యం విద్యా రంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం...స్వాతంత్ర్యం మా జన్మహక్కు అంటూ స్వాతంత్ర్యం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ లక్నో నగరంలో ఏర్పాటు కాబడి నేటికి 89 సంవత్సరాలు పూర్తి చేసుకుని 90వ వసంతంలోకి అడుగుపెట్టి సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. మోకాలే విద్యా విధానం మాకొద్దు అంటూ విద్యా రంగంలో పలు సంస్కరణల కోసం పోరాడి కోఠారి కమిషన్ సిఫారసులు అమలు చేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్ది. చదువుతూ పోరాడూ చదువుకై పోరాడూ అన్న నినాదంతో విద్యా రంగ పరిరక్షణ కోసం బహుముఖ పోరాటాలను నిర్వహించింది. ముఖ్యంగా యూనివర్సిటీలు, బాహ్య సమాజంలో మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర సొంతం. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు, స్కాలర్షిప్ల పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించింది. మహిళలపై జరుగుతున్న దాడులకు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించింది. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికిపుచ్చుకుని పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ పోరాటం విరోచితమైంది. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తూ జాతీయ నూతన విద్యా విధానం పేరుతో విద్యా విధానాన్ని ధ్వంసం చేసే కుట్రలను తిప్పికొట్టాలి. ప్రైవేటు యూనివర్సిటీల బిల్లులను తీసుకువచ్చి ప్రభుత్వ విశ్వ విద్యాలయాల విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలి. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఉద్యమించి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ చరిత్రలో అటల్ బిహరి వాజ్పేయ్, జవహర్ లాల్ నెహ్రూ, మహ్మద్ అలీజిన్నా లాంటి మహామహా మేధావులను దేశానికి అందించిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్ కు ఉంది.

**-ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు**

# నేడే అర్ఎస్ సెల్ఫీ ఎగ్జిబిషన్ ప్రారంభం

**ముఖ్య అతిధిగా హజరుకానున్న ఎమ్మెల్యే**








**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని జలగం వెంగళరావు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జలకన్య నమూనాతో ఏర్పాటు చేసిన ఆర్ ఎస్ సెల్ఫీ ఎగ్జిబిషన్ ను సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాఘమయి దయానంద్ విజయకుమార్ నేడు ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఈ ఎగ్జిబిషన్ ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శివయ్య తెలిపారు. ఎగ్జిబిషన్లో 60 అడుగుల ఎత్తుతో కళ్ళు చెదిరే విద్యుత్ అలంకరణతో జిగేల్ మనేలా ఈపిల్ టవర్ నమూనా, చిన్నారుల కొరకు వాటర్ బోట్, జెయింట్ వీల్, బ్రేక్ డాన్స్, హార్స్ రైడింగ్, గుర్రాల రంగుల రాట్నం, జారుడు బౌన్సర్ తదితర ఆట వస్తువులతో పాటు మహిళల అలంకరణకు అందమైన డిజైన్లలో వస్తువులు, గృహోపకరణాలు, రుచికరమైన స్నాక్స్, డిల్లీ మసాలా, అప్పడాలు, సిమ్లా మిర్చీ, చాట్ బండార్, ప్రత్యేక ఐస్ క్రీం, కూల్ డ్రింక్స్ అందుబాటులో ఉంటాయన్నారు. సోమవారం నుండి ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటల నుండి 11 గంటల వరకు సుమారు నెల రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ ను నిర్వహించనున్నట్లు శివయ్య తెలిపారు.

# మేఘావృతమైన ఆకాశం



గత రెండు మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలతో ఆదరగొట్టిన భానుడు ఆదివారం చల్లబడ్డాడు. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై నల్లని మబ్బులు కమ్ముకున్నాయి. ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించిన ప్రజాపక్షం స్టాఫ్

-ఫోటోగ్రాఫర్ అంజి.

# ఎన్ఎస్పి కాలువకు గండి

**-మంచి నీటి చెరువుకు ప్రమాదం**

**-అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ మండి పడుతున్న రైతులు**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని, వేంసూరు మండలం కుంచపర్తి గ్రామ సమీపంలో గల ఎన్.ఎస్.పి సాగర్ కాలువకు భారీ గండి పడింది. సాగర్ కాలువలోని నీళ్లు సమీపంలోని మంచినీళ్ల చెరువులోకి చేరుకుంటున్నాయి. సరైన సమయానికి దిగువన ఉన్న లాకులు ఎత్తకపోవడంతో కాలువకు గండి పడినట్లు రైతులు తెలుపుతున్నారు. అయితే కాల్వకు గండి పడి పెద్ద మొత్తంలో నీరు మంచినీరు చెరువులోకి చేరుకుంటూ ఉండటంతో చెరువు ఆయకట్ట భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి చెరువు సాగర్ కాలువ నీటితో నిండి ప్రమాదకరంగా మారింది. కాలువకు గండిపడి భారీగా నీరు వృధాగా పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అధికారుల నిర్లక్ష్యం తో నే సాగర్ కాలువకు గండి పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# తూతా నాగమణి కన్నుమూత



**ప్రజాపక్షం/దమ్మపేట:** తెలంగాణ ఉద్యమ నాయకురాలు తూతా నాగమణి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. దమ్మపేట మండలం వడ్ల గూడెం గ్రామానికి చెందిన నాగమణి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఎక్కడ పోరాటం సమ్మె జరిగిన ఆమె ముందు ఉండి ప్రజలను, కార్యకర్తలను ఉత్సాహపరిచేవారు. రాష్ట్ర సాధన సమయంలో ఎన్నో అవమానాలు ఎదురైన రాష్ట్ర సాధన ముఖ్యమని పట్టు విడవకుండా చివరి వరకు రాష్ట్ర సాధన కోసం పోరాడిన వ్యక్తి తూతా నాగమణి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దమ్మపేట సభకి విచ్చేసినప్పుడు నాగమణిని స్టేజి మీద చూసి ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. స్టేజి మీద ఆమెకి ప్రత్యేకంగా సీటు కేటాయించారన్నారు. నాగమణి మృతితో ఆమె స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగమణి బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకురాలు శిశు సంక్షేమ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కోఆర్డినేటర్ గా పనిచేశారు. నాగమణి మృతికి పలువురు బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పిటిసిలు, సర్పంచ్లు తూతా నాగమణి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పత్తి చేనుకు మందు పిచికారి చేసిన వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పత్తి చేనుకు మందు పిచికారి చేసిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం కాచనపల్లి గ్రామానికి చెందిన సంపంగి సిద్ధు(17)గత రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి పత్తి చేనులో పిచికారి చేయడానికి వెళ్లాడని, సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత వాంతులు చేసుకోవడంతో, స్థానిక ఆర్ఎంపి వద్ద తీసుకెళ్లారు. మరుసటి రోజు కుటుంబ సభ్యులకి అక్కడి నుండి ఇల్లందు ఆర్ఎంపి వద్ద వైద్యం చేపించారని పరిస్థితి విషమించడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపినట్లుగా తెలిపారు.

# మండలంలో మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రేడ్డి మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం పర్యటించారు. ముజ్జుగూడెం, నేలకొండపల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పలు వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధువరులను ఆశ్వీరదించారు. అనంతరం కార్యకర్తలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, సోసైటీ చైర్మన్ లు నాగుబండి శ్రీనివాస రావు, కోటి సైదారెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, నాయకులు మరికంటి రేణు బాబు, షేక్ హుస్సేన్, కమదన ప్రవీణ్, యలమంద, మాదాసు ఆదాం, సిద్దయ్య, కుక్కల సామేల్, అనగాని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా బోనాల జాతర



**ప్రజాపక్షం/అశ్వాపురం:** శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని మల్లెలమడుగు, మొండికుంట, సీతారామపురం గ్రామాలలో ముత్యాలమ్మ తల్లి దేవాలయాల్లో బోనాల మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని ఇండ్లలో ఆడపడుచులను పిలుచుకొని పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించి బోనాలను నెత్తిన పెట్టుకుని ప్రదర్శనగా ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. బోనాల నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి చల్లగా చూడాలని వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని మొక్కులు మొక్కుకున్నారు. కోరిన కోర్కెలు తీరని భక్తులు అమ్మవారికి చీర, సారెలతో పాటు కోళ్లు, జీవాలను బలి ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు.

